01-11-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - బ్రహ్మ సంతానమైన మీరు పరస్పరంలో సోదరీ-సోదరులు, మీ వృత్తి చాలా శుద్ధముగా, పవిత్రముగా ఉండాలి"

ప్రశ్న:- ఏ పిల్లలు అర్థం చేయిస్తే ప్రభావము చాలా బాగా పడగలదు?

జవాబు:- ఎవరైతే గృహస్థ వ్యవహారంలో ఉంటూ కమలపుష్ప సమానంగా పవిత్రంగా ఉంటారో, అటువంటి అనుభవజ్ఞులైన పిల్లలు ఎవరికైనా అర్థం చేయించినట్లయితే వారు అర్థం చేయించినదాని ప్రభావము చాలా బాగా పడగలదు, ఎందుకంటే వివాహం చేసుకుని కూడా వృత్తి అపవిత్రంగా అవ్వకపోవడము అనేది చాలా పెద్ద గమ్యము. ఇందులో పిల్లలు చాలా-చాలా జాగ్రత్తగా కూడా ఉండాలి.

పాట:- మా తీర్థాలు అతీతమైనవి... (హమారే తీర్థ్ న్యారే హై...)

ఓం శాంతి. తండ్రి కూర్చొని పిల్లలకు అర్థం చేయిస్తారు ఎందుకంటే పిల్లలకే తండ్రి గురించి తెలుసు. పిల్లలైతే అందరూ పిల్లలే, పిల్లలందరూ బ్రహ్మకుమారులు-కుమారీలు. బ్రహ్మకుమారులు-కుమారీలు సోదరీ-సోదరులవుతారని వారికి తెలుసు. అందరూ ఒక్క తండ్రికే పిల్లలైనప్పుడు ఆత్మలమైన మనమంతా సోదరీ-సోదరులమని వాస్తవికంగా అర్థం చేయించాలి. అందరూ సోదరులే. మనము ఒకే తాతగారు మరియు తండ్రి యొక్క పిల్లలమని ఇక్కడైతే మీకు తెలుసు. శివబాబాకు మనుమలము, బ్రహ్మకు పిల్లలము. ఉదాహరణకు ఇతని లౌకిక పత్ని ఉన్నారు, ఆమె కూడా - నేను బ్రహ్మకుమారీని అని అన్నారు, కావున ఆమె సంబంధము కూడా ఆ విధంగానే అవుతుంది. ఏ విధంగా లౌకిక సోదరీ-సోదరులు ఉంటారు, అక్కడ అశుద్ధ దృష్టి ఏమీ ఉండదు, ఈ రోజుల్లోనైతే అందరూ అశుద్ధంగా అవుతూ ఉంటారు ఎందుకంటే ప్రపంచమే అశుద్ధంగా ఉంది. పిల్లలైన మీరు ఇప్పుడు అర్థం చేసుకున్నారు - మనము బ్రహ్మకుమారులము-బ్రహ్మకుమారీలము. బ్రహ్మ ద్వారా దత్తత తీసుకోబడ్డ పిల్లలుగా అయ్యారు కావున మీరు సోదరీ-సోదరులు అవుతారు. సన్యాసము కూడా రెండు రకాలుగా ఉంటుందని అర్థం చేయించవలసి ఉంటుంది. సన్యాసము అనగా పవిత్రముగా ఉండడము, 5 వికారాలను విడిచిపెట్టడము. వారు హఠయోగ సన్యాసులు, వారి డిపార్టుమెంటే వేరు. ప్రవృత్తి మార్గం వారితో సంబంధాన్ని వదిలి వెళ్ళిపోతారు, వారి పేరే హఠయోగ కర్మ సన్యాసులు. పిల్లలైన మీకు అర్థం చేయించడం జరుగుతుంది - గృహస్థ వ్యవహారంలో ఉంటూ దేహ సహితంగా దేహపు సర్వ సంబంధాలను త్యజించి తండ్రిని స్మృతి చేయాలి. వారైతే ఇళ్ళు-వాకిళ్ళను వదిలేస్తారు. మామయ్య, చిన్నాన్న, పెదనాన్న ఎవ్వరూ ఉండరు. ఏమని భావిస్తారంటే - మిగిలినవారు ఒక్కరే, వారినే స్మృతి చేయాలి లేక జ్యోతి జ్యోతిలో కలిసిపోవాలి, నిర్వాణధామానికి వెళ్ళిపోవాలి. వారి డిపార్టుమెంటే వేరు, వేషధారణ వేరు. వారేమో - స్త్రీ నరకానికి ద్వారము, దూది-అగ్ని కలిసి ఉండలేవు, వేరుగా ఉంటేనే మేము రక్షించబడగలము అని అంటారు. డ్రామానుసారంగా వారి ధర్మమే వేరు. దానిని శంకరాచార్యులు స్థాపన చేసారు, వారు హఠయోగాన్ని, కర్మసన్యాసాన్ని నేర్పిస్తారు, అంతేకానీ రాజయోగాన్ని కాదు. ఈ డ్రామా తయారై-తయారుచేయబడినది అని మీకు నంబరువారుగా తెలుసు. అందరినీ అయితే 100 శాతము తెలివైనవారు అని అనరు. కొందరు 100 శాతము తెలివైనవారు ఉన్నారు, కొందరు 100 శాతము తెలివిహీనులు కూడా ఉన్నారు. ఇలాగే ఉంటుంది. మీకు తెలుసు - మనం మమ్మా-బాబా అని అంటున్నామంటే మనం పరస్పరంలో సోదరీ-సోదరులు అయినట్లు. అశుద్ధమైన వృత్తి ఉండకూడదు, నియమం అలా చెప్తుంది. సోదరీ-సోదరులకు పరస్పరంలో ఎప్పుడూ వివాహం జరగదు. ఒకవేళ ఇంట్లో సోదరీ-సోదరుడి మధ్యన ఏదైనా జరిగినట్లయితే, వీరి నడవడిక అశుద్ధంగా ఉందని తండ్రి గమనిస్తే, అతనికి చాలా చింత ఉంటుంది. వీరెక్కడి నుండి జన్మించారు, ఎంతగా నష్టపరుస్తున్నారు అని అనుకుంటారు. వారిని ఎంతగానో తిడతారు. ఇంతకుముందు ఈ విషయాలలో జాగ్రత్త ఉండేది. ఇప్పుడైతే 100 శాతము తమోప్రధానంగా ఉన్నారు, మాయ ప్రభావము తప్పకుండా తీవ్రంగా ఉంది. పరమపిత పరమాత్ముని పిల్లలతోనైతే మాయ బాగా యుద్ధము చేస్తుంది. తండ్రి అంటారు - వీరు నా పిల్లలు, నేను వీరిని స్వర్గంలోకి తీసుకువెళ్తాను. మాయ అంటుంది - కాదు, వీరు నా పిల్లలు, నేను వీరిని నరకములోకి తీసుకువెళ్తాను. ఇక్కడైతే ధర్మరాజు అయిన తండ్రి చేతిలో ఉన్నారు. కావున ఎవరైతే గృహస్థ వ్యవహారంలో ఉంటూ పవిత్రంగా ఉంటారో, వారు - తాము కలిసి ఉంటూ కూడా ఏ విధంగా పవిత్రంగా ఉంటారనేది ఇతరులకు చాలా బాగా అర్థం చేయించాలి. ఏ పనినైతే హఠయోగ సన్యాసులు కూడా చేయలేకపోయారో, దానిని తండ్రి చేయిస్తున్నారు. సన్యాసులు ఎప్పుడూ రాజయోగాన్ని నేర్పించలేరు. వివేకానందుని పుస్తకంపై బయటకు రాజయోగము అన్న పేరు రాయబడి ఉంది. కానీ నివృత్తి మార్గములోని సన్యాసులు రాజయోగాన్ని నేర్పించలేరు. మీలో ఎవరైతే గృహస్థ

వ్యవహారంలో ఉంటూ పవిత్రంగా ఉంటారో, అటువంటివారు అర్థం చేయించినట్లయితే వారి బాణము బాగా తగులుతుంది. బాబా వార్తాపత్రికలో చూసారు - ఢిల్లీలో చెట్లకు సంబంధించి ఏదో కాన్ఫరెన్స్ జరుగుతుంది. అక్కడ కూడా ఎలా అర్థం చేయించవచ్చు అంటే - మీరు ఈ అడవుల్లోని చెట్లు మొదలైనవాటి గురించి ఆలోచిస్తున్నారు కానీ ఈ జినలాజికల్ ట్రీ (వంశవృక్షము) గురించి, ఈ మనుష్య సృష్టి ఉత్పత్తి, పాలన ఎలా జరుగుతుంది అన్నదాని గురించి ఎప్పుడైనా ఆలోచించారా?

పిల్లలది అంత విశాలబుద్ధిగా అవ్వలేదు. అంతటి అటెన్షన్ లేదు. ఏదో ఒక వ్యాధి అంటుకొని ఉంది. లౌకిక ఇంట్లో కూడా సోదరీ-సోదరులకు ఎప్పుడూ అశుద్ధమైన ఆలోచనలు ఉండవు. ఇక్కడైతే మీరందరూ ఒకే తండ్రి పిల్లలు, సోదరీ-సోదరులు, బ్రహ్మాకుమారులు-కుమారీలు. ఒకవేళ అశుద్ధమైన ఆలోచనలు కలిగినట్లయితే వారిని ఏమంటారు? వారిని, నరకంలో ఉండేవారికన్నా, వేయి రెట్లు అశుద్ధమైనవారిగా లెక్కించడం జరుగుతుంది. పిల్లలపై ఎంతో బాధ్యత ఉంది. ఎవరైతే గృహస్థ వ్యవహారంలో ఉంటూ పవిత్రంగా ఉంటారో, వారి కొరకు ఎంతో శ్రమ ఉంటుంది. ప్రపంచానికి ఈ విషయాల గురించి తెలియదు. తండ్రి పావనంగా తయారుచేయడానికి వస్తారు కావున పిల్లలు తప్పకుండా ప్రతిజ్ఞ చేస్తారు, రాఖీ కట్టబడి ఉంది. ఇందులో ఎంతో శ్రమ ఉంది. వివాహం చేసుకుని పవిత్రంగా ఉండడము, ఇది చాలా పెద్ద గమ్యము. కొద్దిగా కూడా బుద్ధి అటువైపుకు వెళ్ళకూడదు. వివాహం జరిగితే వికారులుగా అయిపోతారు. తండ్రి వచ్చి వివస్త్రగా అవ్వడం నుండి రక్షిస్తారు. శాస్త్రాలలో ద్రౌపది విషయం కూడా ఉంది. ఈ విషయాలలో ఏదో రహస్యమైతే ఉంది కదా. ఈ శాస్త్రాలు మొదలైనవన్నీ డ్రామాలో రచించబడి ఉన్నాయి - ఏదైతే గడుస్తూ వచ్చిందో, అది డ్రామాలో రచించబడి ఉంది, అది తప్పకుండా రిపీట్ అవుతుంది. జ్ఞాన మార్గం మరియు భక్తి మార్గం కూడా రచించబడి ఉన్నాయి. మీ బుద్ధి ఇప్పుడు చాలా విశాలంగా అయ్యింది. అనంతమైన తండ్రి బుద్ధి ఏ విధంగా ఉందో, శ్రీమతంపై నడిచే అతి ప్రియమైన పిల్లల బుద్ధి కూడా అదే విధంగా ఉంది. లెక్కలేనంతమంది పిల్లలు ఉన్నారు. ఇంకా ఎంతమంది పిల్లలుగా అవుతారో తెలియదు. ఎప్పటివరకైతే బ్రాహ్మణ-బ్రాహ్మణీలుగా అవ్వరో అప్పటివరకూ వారసత్వాన్ని పొందలేరు. ఇప్పుడు బ్రహ్మావంశీయులైన మీరే మళ్ళీ వెళ్ళి సూర్యవంశీయులుగా అనగా విష్ణువంశీయులుగా అవుతారు. ఇప్పుడు మీరు శివవంశీయులు. శివుడేమో దాదా (తాతగారు), బ్రహ్మా ఏమో బాబా (తండ్రి). ప్రజలందరికీ ప్రజాపిత అయితే ఒక్కరే అయినట్లు కదా. మనుష్య సృష్టి రూపీ వృక్షము ఏదైతే ఉందో, దానికి కూడా బీజము ఉంటుందని తెలుసు కూడా. అందులో మొదటి మానవుడు కూడా ఉంటారు, వారిని న్యూ మ్యాన్ అని అంటారు. న్యూ మ్యాన్ ఎవరై ఉంటారు? బ్రహ్మాయే అవుతారు. బ్రహ్మా మరియు సరస్వతి - వారు కొత్తవారిగా లెక్కించబడతారు. ఈ విషయాలను అర్థం చేసుకునేందుకు విశాలబుద్ధి కావాలి. ఓ గాడ్ ఫాదర్, ఓ సుప్రీమ్ గాడ్ ఫాదర్ అని ఆత్మయే అంటుంది. ఆత్మయే అంటుంది కావున వారు అందరికీ రచయిత. వారే ఉన్నతోన్నతమైనవారు. ఆ తర్వాత ఈ మనుష్య సృష్టిలో చూడండి. వీరిలో ఉన్నతమైనవారిగా ఎవరిని ఉంచాలి? ప్రజాపితను. మనుష్య సృష్టి యొక్క వృక్షమేదైతే ఉందో, అందులో బ్రహ్మా ముఖ్యమైనవారని ఎవరైనా అర్థం చేసుకోగలరు. శివుడు ఆత్మలకు తండ్రి, బ్రహ్మాను మనుష్యుల రచయిత అని అనవచ్చు. కానీ ఎవరి మతము అనుసారంగా రచిస్తారు? తండ్రి అంటారు - నేనే బ్రహ్మాను దత్తత తీసుకుంటాను. కొత్త బ్రహ్మా ఎక్కడి నుండి వస్తారు? అనేక జన్మల అంతిమ జన్మలో నేను వీరిలోకి ప్రవేశిస్తాను. వీరికి ప్రజాపిత బ్రహ్మా అన్న పేరును పెడతాను. ఇప్పుడు మీకు తెలుసు - మనం తప్పకుండా బ్రహ్మాకు పిల్లలము. శివబాబా నుండి జ్ఞానాన్ని తీసుకుంటున్నాము. మనం తండ్రి నుండి పవిత్రతను, సుఖాన్ని, శాంతిని, ఆరోగ్యాన్ని, ఐశ్వర్యాన్ని తీసుకునేందుకు వచ్చాము. భారత్ లో మనమే సదా సుఖవంతులుగా ఉండేవారము. ఇప్పుడు అలా లేము. మళ్ళీ తండ్రి ఆ వారసత్వాన్ని ఇస్తున్నారు. పవిత్రత ఫస్ట్ అని పిల్లలకు తెలుసు. రాఖీ ఎవరికి కట్టడం జరుగుతుంది? ఎవరైతే అపవిత్రంగా అవుతారో, వారు - మేము పవిత్రంగా ఉంటాము అని ప్రతిజ్ఞ చేస్తారు. ఈ గమ్యము చాలా గొప్పది అని తండ్రి అర్థం చేయిస్తారు. ఎవరైతే ముందు నుండే యుగళులుగా ఉన్నారో వారు - తాము సోదరీ-సోదరులుగా ఎలా ఉంటున్నారు అన్నది అర్థం చేయించాలి. అయితే, అవస్థను తయారుచేసుకోవడానికి సమయం పడుతుంది. మాయా తుఫానులు ఎంతగానో వస్తాయని పిల్లలు రాస్తారు కూడా. కావున గృహస్థ వ్యవహారంలో ఉంటూ పవిత్రంగా ఉండే పిల్లలు భాషణ చేసినట్లయితే మంచిది ఎందుకంటే ఇది కొత్త విషయము. ఇది స్వ-రాజయోగము. ఇందులో కూడా సన్యాసము ఉంది. గృహస్థ వ్యవహారంలో ఉంటూ మనం జీవన్ముక్తిని అనగా సద్గతిని పొందాలి. ఇది జీవనబంధనము. మీది స్వరాజ్య పదవి. స్వయానికి రాజ్యం కావాలి. ఇప్పుడు స్వయానికి రాజ్యం లేదు. ఆత్మ అంటుంది - నేను రాజుగా ఉండేవాడిని, నేను రాణిగా ఉండేదానిని, ఇప్పుడు నేను వికారీగా, నిరుపేదగా అయిపోయాను, నాలో ఏ గుణాలూ లేవు. ఈ విధంగా ఆత్మయే అంటుంది కదా. కావున స్వయాన్ని ఆత్మగా, పరమపిత పరమాత్ముని సంతానంగా భావించాలి. ఆత్మలమైన మనము సోదరులము, పరస్పరంలో చాలా ప్రేమ ఉండాలి. మనం మొత్తం ప్రపంచమంతటినీ

ప్రియంగా తయారుచేస్తాము. రామరాజ్యంలోనైతే పులి-మేక కూడా కలిసి నీరు త్రాగేవి, ఎప్పుడూ కొట్లాడుకునేవి కావు, కావున పిల్లలైన మీలో ఎంత ప్రేమ ఉండాలి. ఈ అవస్థ నెమ్మది-నెమ్మదిగా వస్తుంది. ఎంతగానో కొట్లాడుకుంటూ ఉంటారు కదా. పార్లమెంటులో కూడా కొట్లాడుకుంటారు, అప్పుడు కుర్చీలు ఎత్తి ఒకరినొకరు కొట్టుకోవడం మొదలుపెడతారు. అది అసురీ సభ. ఇది మీ ఈశ్వరీయ సభ, కావున ఎంత నషా ఉండాలి. కానీ ఇది స్కూలు. చదువులో కొందరు ఉన్నతిలోకి వెళ్తారు, కొందరు డీలా అయిపోతారు. ఈ స్కూలు కూడా అద్భుతమైనది, అక్కడైతే స్కూల్ టీచర్లు వేర్వేరుగా ఉంటారు, ఇక్కడ స్కూల్ టీచరు ఒక్కరే, స్కూలు కూడా ఒక్కటే. ఆత్మ శరీరాన్ని ధరించి చదివిస్తుంది. ఆత్మకు చదివిస్తారు. ఆత్మలమైన మనం శరీరం ద్వారా చదువుకుంటాము. అంతగా ఆత్మాభిమానులుగా అవ్వాలి. మనము ఆత్మలము, వారు పరమాత్మ. ఈ విషయాలు బుద్ధిలో రోజంతా తిరుగుతూ ఉండాలి. దేహాభిమానం కారణంగానే పొరపాట్లు జరుగుతాయి. దేహీ-అభిమానీ భవ అని తండ్రి పదే-పదే చెప్తారు. దేహాభిమానంలోకి రావడం వలన మాయ దాడి జరుగుతుంది. చాలా పైకి ఎక్కాలి. ఎంతగా విచార సాగర మథనము చేయవలసి ఉంటుంది. రాత్రివేళలోనే విచార సాగర మథనము జరుగగలదు. ఈ విధంగా విచార సాగర మథనము చేస్తూ-చేస్తూ తండ్రిలా తయారవుతూ ఉంటారు.

పిల్లలైన మీరు మొత్తం జ్ఞానాన్ని బుద్ధిలో ఉంచుకోవాలి. గృహస్థ వ్యవహారంలో ఉంటూ రాజయోగాన్ని నేర్చుకోవాలి. ఇదంతా బుద్ధికి సంబంధించిన పని. బుద్ధిలో ధారణ జరుగుతుంది. గృహస్థులకైతే ఎంతో శ్రమ ఉంటుంది. ఈ రోజుల్లో తమోప్రధానంగా ఉన్న కారణంగా చాలా అశుద్ధంగా ఉంటారు. మాయ అందరినీ అంతం చేసేసింది. పూర్తిగా నమిలి మింగేస్తుంది. మాయా రూపీ కొండచిలువ యొక్క కడుపులో నుండి బయటకు తీసేందుకు తండ్రి వస్తారు. బయటకు తీయడం చాలా కష్టమవుతుంది. ఎవరైతే గృహస్థ వ్యవహారంలో ఉంటారో, వారు తమ సత్తాను చూపించాలి. మాది రాజయోగము అని అర్థం చేయించాలి. మనము బ్రహ్మాకుమారులము-కుమారీలము అని ఎందుకు అంటాము? ఈ చిక్కుముడిని అర్థం చేసుకోవాలి, అర్థం చేయించాలి. వాస్తవానికి మీరు కూడా బి.కె.లే. ప్రజాపిత బ్రహ్మా అయితే కొత్త సృష్టిని రచిస్తారు. న్యూ మ్యాన్ ద్వారా కొత్త సృష్టిని తయారుచేస్తారు. వాస్తవానికి సత్యయుగం యొక్క మొదటి బిడ్డనే 'న్యూ (కొత్తవారు)' అని అంటారు. ఇది ఎంత సంతోషకరమైన విషయము. అక్కడైతే సంతోషపు భాజా-భజంత్రీలు మ్రోగుతాయి. అక్కడ ఆత్మ మరియు శరీరము రెండూ పవిత్రంగా ఉంటాయి. ఇక్కడైతే వీరిలోకి ఇప్పుడు బాబా ప్రవేశించారు. ప్రస్తుతం ఈ న్యూ మ్యాన్ పవిత్రమైనవారు కారు, పాతవారిలో కూర్చొని వీరిని కొత్తవారిగా తయారుచేస్తారు. పాతదానిని కొత్తగా తయారుచేస్తారు. ఇప్పుడు న్యూ మ్యాన్ అని ఎవరిని అనాలి? బ్రహ్మాను అనాలా? ఈ విషయంలో బుద్ధి నడుస్తుంది. ఏడమ్-ఈవ్ ఎవరు అన్నది వారు ఏమైనా అర్థం చేసుకుంటారా. న్యూ మ్యాన్ (కొత్త వ్యక్తి) శ్రీకృష్ణుడు, అతనే మళ్ళీ ఓల్డ్ మ్యాన్ (పాత వ్యక్తి) అయిన బ్రహ్మాగా అవుతారు. మళ్ళీ ఓల్డ్ మ్యాన్ అయిన బ్రహ్మాను న్యూ మ్యాన్ గా తయారుచేస్తాను. కొత్త ప్రపంచానికి న్యూ మ్యాన్ కావాలి. వారు ఎక్కడి నుండి వస్తారు? న్యూ మ్యాన్ సత్యయుగానికి రాకుమారుడు. వారినే తెల్లనివారు అని అంటారు. ఇతను నల్లనివారు, ఇతను న్యూ మ్యాన్ కాదు. ఆ శ్రీకృష్ణుడే 84 జన్మలు తీసుకుంటూ-తీసుకుంటూ ఇప్పుడు చివరి జన్మలో ఉన్నారు, వీరినే మళ్ళీ బాబా దత్తత తీసుకుంటారు. పాతవారిని కొత్తగా తయారుచేస్తారు, ఇవి అర్థం చేసుకోవలసిన ఎంత గుహ్యమైన విషయాలు. కొత్తదే పాతగా, పాతదే మళ్ళీ కొత్తగా అవుతుంది. శ్యామము నుండి సుందరంగా, సుందరం నుండి మళ్ళీ శ్యామంగా అవుతారు. అందరికన్నా పాతవారు ఎవరైతే ఉన్నారో, వారే మళ్ళీ అందరికన్నా కొత్తవారిగా అవుతున్నారు. బాబా మనల్ని పునర్జీవితులను చేసి అందరికన్నా కొత్తవారిగా తయారుచేస్తారని మీకు తెలుసు. ఇవి బాగా అర్థం చేసుకోవలసిన విషయాలు. అలాగే మీ అవస్థను కూడా తయారుచేసుకోవాలి. కుమారులు-కుమారీలు పవిత్రమైనవారు. ఇకపోతే మనం గృహస్థంలో ఉంటూ కమలపుష్ప సమానంగా అవుతాము, స్వదర్శన చక్రధారులుగా అవుతాము. విష్ణు వంశీయులకు త్రికాలదర్శులుగా అయ్యే జ్ఞానం లేదు. ఓల్డ్ మ్యాన్ (పాత వ్యక్తి) త్రికాలదర్శిగా ఉంటారు. ఇవి ఎంత విచిత్రమైన విషయాలు. ఓల్డ్ మ్యాన్ జ్ఞానాన్ని తీసుకొని న్యూ మ్యాన్ గా అవుతారు. తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు - అది హఠయోగము, ఇది రాజయోగము. రాజయోగము అంటేనే స్వర్గ రాజ్యాధికారము. సన్యాసులైతే సుఖము కాకిరెట్టతో సమానమైనదని అంటారు. వారు దానిని ద్వేషిస్తారు. తండ్రి అంటారు - నారియే స్వర్గానికి ద్వారము. నేను మాతలపై కలశాన్ని పెడతాను. కావున మొట్టమొదట శివాయ నమః, భగవానువాచ అని అర్థం చేయించండి. శబ్దం గట్టిగా వెలువడాలి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక

పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఆత్మలమైన మనం సోదరులము, ఈ నిశ్చయంతో పవిత్రతా వ్రతాన్ని పాలన చేస్తూ పరస్పరం చాలా ప్రేమగా ఉండాలి. అందరినీ ప్రియంగా తయారుచేయాలి.

2. విశాలబుద్ధి కలవారిగా అయి జ్ఞానం యొక్క గుహ్యమైన రహస్యాలను అర్థం చేసుకోవాలి, విచార సాగర మథనము చేయాలి. మాయ దాడి నుండి రక్షించుకునేందుకు దేహీ-అభిమానులుగా ఉండే అభ్యాసము చేయాలి.

వరదానము:- జ్ఞానామృత వర్షము ద్వారా మహానులుగా అయ్యే మరజీవా భవ

పిల్లలైన మీపై తండ్రి జ్ఞానామృత వర్షాన్ని కురిపించి మృతుల నుండి మహానులుగా తయారుచేసారు. కాలుతున్న చితిపై నుండి బయటకు తీసి మరజీవాగా చేసారు. జ్ఞానామృతాన్ని త్రాగించి అమరులుగా చేసారు. భగవంతుడు మృతులను కూడా సజీవులుగా చేస్తారని మనుష్యులు అంటారు కానీ ఎలా చేస్తారు అన్నది వారికి తెలియదు. దేహాభిమానము కారణంగా ఇంతకుముందు మరణించి ఉన్న మృతుల వలె ఉన్న మీరు ఇప్పుడు మృతుల నుండి మహానులుగా అయ్యారని ఇప్పుడు మీకు సంతోషము ఉంది.

స్లోగన్:- ధర్మములో స్థితులై కర్మలు చేసేవారే ధర్మాత్ములు.

ఈ మాసములోని మురళీలన్నీ (ఈశ్వరీయ మహావాక్యాలు) నిరాకార పరమాత్మ అయిన శివుడు బ్రహ్మ ముఖ కమలము ద్వారా తమ బ్రహ్మవత్సలకు అనగా బ్రహ్మకుమారులు మరియు బ్రహ్మకుమారీల సమ్ముఖంలో 18-1-1969 కంటే ముందు ఉచ్చరించినవి. ఇవి కేవలము బ్రహ్మకుమారీస్ సంస్థలోని టీచరు అక్కయ్యల ద్వారా రెగ్యులర్ బి.కే.విద్యార్థులకు వినిపించటము కోసము మాత్రమే ఉన్నాయి.